

ఓం సమర్థ సద్గురు శ్రీ సాయినాథాయ నమః

# శ్రీ సాయి లీలామృతము

## అధ్యాయము - 8



## విశ్వరూపము

శ్రీ గురుగీత, సద్గురువు యొక్క ఆధ్యాత్మిక స్థితి గురించి 'గురుర్విశ్వం నచాన్యోఽస్తి' అంటే 'గురువు ఖల్విదం బ్రహ్మ' - "ఈ సర్వమూ బ్రహ్మమే" అని వేదాలు చెబుతున్నాయి. దీనినే "ఇందుగలడందులేడని సందేహము వలదు చక్రి" అని భాగవతం చెబుతుంది. ఆ బ్రహ్మమే, ఆ భగవంతుడే తానైనవాడు మాత్రమే గురువు. శ్రీకృష్ణుడు అర్జునునికి విశ్వరూపము దర్శనమిచ్చినట్లే, రెండవ దత్తావతారమైన శ్రీ నరసింహ సరస్వతీస్వామి త్రివిక్రమభారతియనే సన్యాసికిగూడ ప్రసాదించారు. ఈ కాలంలో అజ్ఞులైన ప్రజలందరికీ స్థూలమైన అనుభవాలద్వారా సర్వదేవతలు, మహాత్ములు, జీవులేగాక జడమని తలచబడే పూజావిగ్రహాలు, పటాలుగూడ తమ రూపమేనని తెల్పినవారు శ్రీ సాయి ఒక్కరేనేమో!

శిరిడీలో ఒకనాటి మధ్యాహ్నం శ్రీమతి తార్ఖాడ్ వడ్డన చేస్తుంటే, ఆకలిగొన్న కుక్క ఒకటి వచ్చి జాలిగా చూసింది. వెంటనే ఆమె ఒక రొట్టెవేస్తే ఎంతో ఆత్రంగా తిని వెళ్ళిపోయింది. నాటి సాయంత్రం మశీదులో సాయి ఆమెతో, 'తల్లీ! నీవు పెట్టిన రొట్టెతో నా ఆకలి, ప్రాణాలు కుదుటపడ్డాయి!" అన్నారు. ఆమె ఆశ్చర్యంతో, "నేను మీకెప్పుడన్నం పెట్టాను?" అన్నది. "మధ్యాహ్నం నీవు రొట్టెవేసిన కుక్కను నేనే. అన్ని జీవుల రూపాలలోనూ నేనే ఎప్పుడూ వుంటాను. ఆకలిగొన్న ప్రాణికి పెట్టాక నీవు తింటుండు, నీకెంతో మేలవుతుంది. మశీదులో కూర్చొని నేనెన్నడూ అబద్ధం చెప్పను" అన్నారు బాబా.

ఒకరోజు సాయంత్రం సాయి మసీదుముంగిట ప్రహరీకి ఆనుకొని నిల్చొని తాత్యా మొదలైన భక్తులతో మాట్లాడుతున్నారు. లక్ష్మీబాయిషిండే వచ్చి నమస్కరించగానే, "అమ్మా, నాకెంతో ఆకలిగా వున్నది" అన్నారు. ఆమె వెంటనే వెళ్ళి రొట్టెలు, కూర చేసుకొచ్చింది. కాని బాబా వాటిని ప్రక్కనున్న కుక్కకు వేసారు. ఆమె చిన్నబుచ్చుకుని, 'మీకోసమని శ్రమపడి చేసుకొచ్చానే!'అన్నది. అపుడు బాబా, "దాని ఆకలి తీరితే నా ఆకలి తీరినట్లే. దానికి నోరు లేకపోవచ్చుగాని ఆత్మ వున్నది. ఆకలిగొన్న ప్రాణికి అన్నం పెడితే నాకు పెట్టినట్లే!" అన్నారు. నాటి నుండి రోజూ అదే సమయానికి ఆమె నియమంగా జీవితాంతమూ బాబాకు రొట్టె సమర్పించింది. అందుకే తమ చివరి క్షణంలో సాయి ఆమెననుగ్రహించి రూ. 9/-లు ప్రసాదించారు.

ఏటా కొన్ని నెలలు శ్రీమతి ఖాపర్డే శిరిడీలో వుండి, నిత్యమూ భోజనం బాబాకు నివేదించేది. ఆమె అప్పుడప్పుడూ ఆయనను తన యింటికి భోజనానికి ఆహ్వానించేది. కొద్దిరోజులాయన నవ్వి వూరుకున్నారు. రెండుసార్లు వస్తానన్నారు గానీ రాలేదు. ఆ తర్వాతరోజు ఆమె వంట చేస్తూంటే ఒక కుక్క వాసనబట్టి యింట్లో జొరబడింది. అది వంటకాలను తాకుతుందన్న తొందరలో ఆమె పొయ్యిలోని కట్టెతీసి దానిపై విసిరేసరికి ఆ కుక్క పారిపోయింది. తర్వాత ఆమె మసీదుకు నైవేద్యం తీసుకుపోగానే బాబా, "నేను వస్తే మండుతున్న కట్టె నాపై విసురుతావా?" అన్నారు. మొదట ఆమె నివ్వెరబోయింది గాని, తర్వాత వాస్తవం తెలుసుకున్నది.

ఉబ్బసంతో బాధ భరించలేక హంసరాజ్ సతీసమేతంగా శిరిడీలో కొద్దికాలమున్నాడు. బాబా కృపవలన

వ్యాధి తగ్గిందిగాని, సాయి అతనిని పుల్లపెరుగు సుతరామూ తినవద్దన్నారు. కాని అతడు మూర్ఖించి భార్యచేత రోజూ పాలు తోడు పెట్టించేవాడు. ఆ విషయం బాబాతో చెప్పనివ్వలేదు. అదేమి చిత్రమోగాని, రోజూ ఆ యిద్దరూ ఆరతికి వెళ్ళి వచ్చేలోగా ఒక పిల్లి ఆ పెరుగు త్రాగిపోయేది. ఒకరోజతడు కోపంతో ఆరతికి గూడ వెళ్ళక, పొంచివుండి, పిల్లివచ్చి పెరుగు తాకగానే కఱ్ఱతో కొడితే పారిపోయింది. తర్వాత అతడు మసీదుకు వెళ్ళగానే బాబా, "ఇక్కడొక మూర్ఖుడు పుల్లపెరుగు తిని చావాలని చూస్తున్నాడు. కాని రోజూ అతను తినకుండా చూస్తున్నాను. వాడు నన్నీరోజు కఱ్ఱతో కొట్టాడు!" అన్నారు. సాయి ఒకవంక భక్తులను రక్షిస్తూ, మరొకవంక వారినుండి తిట్లు, దెబ్బలు భరించవలసివచ్చేది. ఒకసారి నానాసాహెబ్ డెంగళే రుచికరమైన వంటకాలు వెండి పళ్ళెంలో వుంచి బాబాకు అర్పించాడు. ఆయన చప్పట్లు చరిచారు. వెంటనే ఒక నల్లకుక్క వచ్చి వాటిని తింటోంది. అదిచూచి అతడు మనసులో అసహ్యించుకున్నాడు. వెంటనే బాబా ఆ పళ్ళెం దూరంగా తోసేసి, "దీనిని నీవే తీసుకో, నాకొద్దు! అన్నాడు. ఆ జీవినసహ్యించుకుంటే వారిని అసహ్యించుకున్నట్లే.

ఒకసారి శిరిడీ వాస్తవ్యులొకరు ఒక కోడెదూడకు నొసట త్రిశూలముద్ర వేసి, శివునిపేర అబోతుగా విడిచారు కొంతకాలానికి అది ఎదిగి పైర్లను పాడుచేస్తోంది. శివుని అబోతని ఎవరూ దానిని దండించేవారుగాదు. చివరకు ఊరి పెద్దలంతా కలసి దానిని బందిల దొడ్డిలో వుంచి, తమ ఖర్చుతో దానిని పుష్టిగా మేపాలని నిర్ణయించి, ఒక నెలఖర్చు యిచ్చి ఒక మార్వాడీతో దానిని యేవలాకు పంపారు. సాయంత్రానికి అతడు శిరిడీవచ్చి ఆ కార్యం నెరవేర్చానన్నాడు. మరుసటి తెల్లవారుఝామున గ్రామంలో ఒక భక్తునికి సాయి మూడుసార్లు స్వప్నంలో కన్పించి, "నన్ను రహటాలో ఒక కసాయి ముంగిట్లో కట్టేసారు. వెంటనే వచ్చి విడిపించు" అన్నారు. తెల్లవారాక అతడాశ్చర్యంతో యేవలా వెళ్ళి విచారిస్తే నిజంగానే మార్వాడి అబోతును రూ. 14/- లకు ఒక కసాయికి అమ్మేసినట్లు తెలిసింది. అప్పుడతడు దానిని విడిపించి, బందిలదొడ్లో అప్పగించి, శిరిడీ వచ్చి గ్రామ పెద్దలకు ఫిర్యాదు చేసాడు. పెద్దలు మార్వాడీకి శిక్ష విధించారు.

ఒకరోజు సాయి పోళీలు కావాలంటే నానాచందోర్కర్ స్వయంగా వండి వాటిని నివేదించాడు. సాయి వాటిని తాకనైనా తాకకుండా కూర్చున్నారు. వాటిమీద ఈగలు, చీమలు చేరాయి. అపుడు సాయి నానాతో, "నేను ఆరగించాను. నీవు తీసుకో!" అన్నారు. నానా ఎంతో నిరుత్సాహపడి, అలిగి అన్నంగూడ తినకుండా చావట్లో పడుకున్నాడు. సాయి అతనిని పిలిపించి, "నానా, 18 సం॥లు నా దగ్గరుండి నీవు గ్రహించినదిదేనా? ఆ చీమలు, ఈగల రూపంలో నేనే ఆరగించాను. నీవు ప్రసాదం తీసుకో!" అన్నారు. "వాటి రూపాలలోనూ మీరే ఆరగించారని నాకు ఋజువేమిటి?" అన్నాడు నానా. బాబా వెంటనే ఒక భంగిమ చేశారు. తనకు తప్ప మరెవ్వరికీ తెలియని తన జీవిత రహస్యం బాబాకు తెలుసునని అతడు గ్రహించాడు. తన హృదయంలోలాగే అన్ని జీవులలోనూ బాబాయే వున్నారని నానాకు అర్థమై ప్రసాదం తీసుకున్నాడు.

నిజానికి జడమైన వస్తువులుగూడ బ్రహ్మమే. ఆ సత్యాన్ని తెల్పే తమ లీలలను భక్తులు పూజించే విగ్రహాలు, పటాలవరకే సాయి పరిమితం చేశారు. లేకుంటే మన నిత్యజీవితాలే తారుమారవుతాయి. భగవంతరావు క్షీరసాగర్ మరణించాక అతని కొడుకు ఇంట్లోని దేవతా విగ్రహాలకు పూజ, నైవేద్యము మానేసాడు. అతడు మొదటిసారి శిరిడీ రాగానే సాయి, "ఇతని తండ్రి నాకాప్తుడు. నాకు నివేదించక తినేవాడు గాదు. ఆయన మరణించాక యితడు నైవేద్యమివ్వక నన్నూ, విఠలుణ్ణీ పస్తుంచాడు. ఇతనికి హితం చెప్పడానికే రప్పించాను" అన్నారు. తల్లిదండ్రులు చేసిన భక్తి సంతతినిగూడ కాపాడుతుంది. వారు యిండ్లలో చేసుకొన్న పూజలు సాయికి చెందుతాయి.

అలానే ఒకప్పుడు కొందరు భక్తులు బాబాను ఫోటో తీయడానికి అనుమతి కోరారు. సాయి మొదట

అనుమతించలేదు. వారు పదేపదే అర్థిస్తూంటే అంగీకరించారు. ఫోటో తీసాక చూస్తే అందులో సాయి పాదాలు మాత్రమే కన్పించాయి. ఆ విషయం చెబితే, "ముఖ్యమైనవి పాదాలే గదా!" అన్నారు బాబా. అదే దత్తపాదుకల ప్రాముఖ్యత. మరొకడు ఆయన అనుమతి పొందకనే ఫోటో తీసాడు. తర్వాత చూస్తే అందులో పడినది అతని గురువు చిత్రమే!

ఒకప్పుడు కాకాదీక్షిత్, తన కుమారుడి ఉపనయనానికి శ్రీ సాయిని నాగపూర్ ఆహ్వానించడానికి శిరిడీ చేరాడు. అదే సమయానికి నానాచందోర్కర్, తన కుమారుడి వివాహానికి సాయిని గ్వాలియర్ ఆహ్వానించటానికి వచ్చాడు. సాయి ఆ యిద్దరితో తమ ప్రతినిధిగా శ్యామాను తీసుకెళ్ళమని చెప్పి, తాము కాశీ, ప్రయాగ, దర్శించి శ్యామాకంటే ముందుగానే గయ చేరగలమని మాట యిచ్చారు. శ్యామా ఆ శుభకార్యాలకు హాజరయ్యాక వారందరూ కొద్ది మాసాలు అయోధ్యలోను, కాశీలోనూ గడిపి, గయలో ఒక పూజారింటికి వెళ్ళారు. అక్కడ సాయిపటం దర్శనమిచ్చింది. దానిని చూడగానే శ్యామాకు ఆనందభాష్పాలొచ్చాయి. ఆ పూజారి 12 సంాలకు పూర్వం శిరిడీ వెళ్ళి, శ్యామా యింటనున్న ఆ పటం తనకు కావాలన్నాడు. సాయి ఆజ్ఞననుసరించి శ్యామా ఆ పటమిచ్చాడు. శ్యామాకంటే ఎన్నో సంాల ముందే సాయి అచటికి చేరారు. శ్యామా ఆ పూజారి యింటనే బస చెయ్యడం ఆశ్చర్యం! అక్కడగూడా బాబా తమవాణ్ణి తమవద్దనే వుంచుకున్నారు.

ధోపేశ్వర్‌నుండి కాకా మహరాజ్ అనే సిద్ధపురుషుడు ఒకసారి పూనా వచ్చారు. అచటి భక్తులు తమ తమ యిండ్లకు ఆహ్వానిస్తుండడంవలన సాయి భక్తుడు సాఠే యింటికి రాలేనని ఖండితంగా చెప్పారు. కాని సాయంత్ర మయ్యేసరికి ఆయనే సాఠే యింటికి వస్తున్నామని కబురుచేసి వచ్చారు. సాఠే ఆశ్చర్యపోతుంటే ఆ స్వామి అక్కడున్న సాయిపటం చూపి, "ఇక్కడకొచ్చేవరకూ ఆయన నన్ను విడువలేదు!" అన్నారు. ఇంట్లో సాయి పటముంటే సాయి వున్నట్లే!

భగవంతుడైన సద్గురువుకు తన రూపాలైన పంచభూతాలు ఆధీనంలో వుంటాయి. వేసవిలో ఒకనాడు ఎండ భరించలేక భక్తులంతా ఇళ్ళకు వెళ్ళారు. అయిదుగురు మాత్రం మసీదులో వుండిపోయారు. సాయి వారిని ధునిదగ్గర కూర్చోమన్నారు. కొద్ది నిముషాలలో మసీదంతా చల్లబడింది. భక్తులంతా ఆశ్చర్యపోయారు. అలానే ఒకసారి కొండాజీ అనే భక్తునితో సాయి, "నీ గడ్డివామికి నిప్పంటుకుంది, వెళ్ళు!" అన్నారు. అతడు వెళ్ళి చూస్తే అక్కడ పొగ కూడా లేదు. సాయి మరలా అలాగే అన్నారు. ఈసారి గడ్డివామి నుండి దట్టంగా పొగలేస్తోంది! దానిచుట్టూ ఎన్నో వాములున్నాయి. గాలి బాగా వీస్తున్నది. గ్రామస్థులు ఆపద నివారించమని సాయిని ప్రార్థించారు. ఆయన దానిచుట్టూ కొద్ది నీరుచల్లి, అది ఒక్కటే తగలబడుతుందని అభయమిచ్చారు. అలానే జరిగింది.

ఒకరోజు సాయి ధునిలో కట్టెలు వేస్తున్నారు. మంటలు విజృంభించి, మసీదువాసాలు అంటుకునేట్లున్నాయి. భక్తులు ఆందోళన చెందుతూంటే, సాయి సట్కాతో ప్రక్కనున్న స్తంభాన్ని కొడుతూ మంటనుద్దేశించి, "తగ్గు, తగ్గు, జాగ్రత్త!" అన్నారు. ధుని అణిగి మందంగా వెలగసాగింది.

భీమా అనేవాడు సాయిలీలలు చూడాలని శిరిడీ వచ్చాడు. మధ్యాహ్నం ఆరతికాగానే సాయి, "నేను పిలిచేవరకు మీ గదులలోనే వుండండి!" అని అందర్నీ పంపేసారు. వారు గదులు చేరగానే సుమారు 15 నిాపాటు యిళ్ళ కప్పులెగిరిపోయేలా పెనుగాలి వీచింది. మబ్బుపట్టి కొద్ది వర్షం కూడా కురిసింది. తరువాత భక్తులను పిలిపించి "భయపడ్డారా?" అన్నారు బాబా. భీమా ఆయన పాదాలకు నమస్కరించగానే, "భగవంతుని లీల చూచావా? ఇలా ఎన్నైనా చూడగలవు" అన్నారు. ఒకరోజు హైకోర్టు న్యాయవాది ప్రధాన్ తప్పక బొంబాయి

బయలుదేరవలసివున్నది! కాని అంతలో తీవ్రమైన గాలి, వాన చెలరేగాయి. అలాగే పావుగంట కొనసాగి కాలువలు పొంగితే బొంబాయి చేరలేమని అతడు భయపడ్డాడు. వెంటనే బాబా మసీదు అంచుకువచ్చి, ఆకాశంకేసి చూచి, "భగవంతుడా! వర్షమాపు. నా బిడ్డలు యిల్లు చేరాలి. వారిని సుఖంగా వెళ్ళనివ్వు!" అన్నారు. వర్షం వెంటనే నిలచిపోయింది. ప్రధాన్ బయలుదేరి బొంబాయి వెళ్ళాడు!

సద్గురువు సాక్షాత్తు భగవంతుడు. సర్వ పుణ్యతీర్థాలూ వారి పాదాలలో వుంటాయని 'గురుగీత' చెబుతుంది. గంగ విష్ణుపాదాలనుండి ఉద్భవిస్తుందంటారు. సద్గురువు ఆ విష్ణుమూర్తే. అయితే దాసగణు తన హరికథలలో సాయిని శ్రీహరిగా కీర్తించినా, అతని హృదయంలో అట్టి విశ్వాసం దృఢపడలేదు. భక్తుడికట్టి విశ్వాసమివ్వవలసినది గూడ సద్గురువే.

ఒక మహాశివరాత్రినాడు దాసగణు గోదావరిలో స్నానంచేసి రాదలచి, సాయి అనుమతి కోరాడు. సాయి, 'గణూ! అందుకోసం అంతదూరం వెళ్ళాలా? శ్రద్ధాభక్తులుంటే ఆ తీర్థాలిక్కడే వున్నాయి. లేకుంటే అక్కడాలేవు!' అన్నారు. 'ఇవిగో, గంగాయమునలు', అని అతని చేతులు తమ పాదాలవద్ద వుంచమన్నారు. సన్నని ధారగా అతని దోసిలి నిండా తీర్థమొచ్చింది. అతడానీరు తీసుకొని క్షణమాలోచించి నెత్తినమాత్రం చల్లుకున్నాడు. బాబా చిరునవ్వుతో మౌనంగా చూచారు. ఆయన సమాధి చెందాక దాసగణు మరొకయోగిని దర్శించినప్పుడు ఆ యోగి, "మూర్ఖుడా! సాయి అంతటి మహనీయుని పాదాలనుండి వచ్చిన తీర్థజలాన్ని, ఆయన ముస్లిమన్న సంకోచంతో, శిరస్సున ధరించావేగాని, నోటిలో పోసుకోలేదుగదా! నీకెన్ని జన్మలకైనా మరల అట్టిది లభిస్తుందా? అంతటి మహనీయుడు మరల దొరుకుతాడా?" అని మందలించారు.

'అభినవ తుకారాం' అని పేరుపొందిన బాలబువాసుతార్, మొదట 1917లో శిరిడీ వచ్చాడు. అతడు నమస్కరించగానే సాయి, 'నాకితడు నాలుగు సం॥ల నుండి తెలుసు!' అన్నారు. అతడు మొదట ఆశ్చర్యపోయాడు గాని, తర్వాత గుర్తొచ్చింది - తాను సరిగ్గా నాలుగు సం॥ల క్రిందటనే బొంబాయిలో మొదట బాబా గురించి విని, వారి పటానికి నమస్కరించాడు. అదే బాబా చెప్పినది!

సదాశివ తార్కాడ్ విగ్రహాలను, గురువులను పూజించటం తగదని నమ్మేవాడు, కాని సాయి భక్తులైన భార్యాబిడ్డలకు అడ్డు చెప్పేవాడు కాదు. ఒకసారి అతడి భార్య శిరిడీ వెళ్ళాలనుకున్నది. తార్కాడ్ తన కొడుకును ఆమెకు తోడుగా వెళ్ళమన్నాడు. కాని అతడు, తాను వెళితే నిత్యమూ తాను సాయి పటానికి చేసే పూజ జరుగదని తలచి వెళ్ళనన్నాడు. తార్కాడ్ గత్యంతరం లేక ఆ పూజ తాను చేస్తానని మాట యిచ్చాక, ఆ తల్లీ కొడుకులు ఒక శనివారంనాడు శిరిడీ చేరారు. తార్కాడ్ సోమవారంవరకు తానిచ్చిన మాటప్రకారం యథావిధిగా బాబా పటాన్ని పూజించాడు. కాని మంగళవారంనాడు ఆఫీసు తొందరలో నైవేద్యం యివ్వటం మరిచిపోయాడు! తర్వాత ఆ సంగతి తెలిసి, బాబాకు తన తప్పుకు క్షమాపణ చెప్పమని శిరిడీకి జాబు వ్రాసాడు. సరిగా ఆరోజు అదే సమయానికి శ్రీమతి తార్కాడ్‌తో సాయి, "అమ్మా! ఆకలేస్తుంటే ఏమైనా పెడతారని మీ యింటికి వెళ్ళాను. పూజగది తలుపు తాళంవేసి వున్నది. నేనెలాగో లోపలికి ప్రవేశించాను. అక్కడ 'భావూ' (సోదరుడు) నాకు తినడానికి ఏమీ వుంచలేదు. ఆకలితో తిరిగివచ్చాను" అన్నారు. ఆమెకేమీ అర్థంకాలేదు, కాని తన ఇంట పూజ గురించి ఆందోళన చెందుతున్న ఆమె కొడుకుకు అర్థమయింది. ఆరతి అయ్యాక, నాడు సాయి అన్న మాటలు, పూజలో లోపం జరుగ నివ్వవద్దనీ తన తండ్రికి జాబు వ్రాసాడు. ఒకే సమయానికి ఒకరి జాబులొకరికి చేరాయి. సాయికి, వారి పటానికీ భేదం లేదన్నమాట!

బాబా 1917లో ఒకనాటి రాత్రి స్వప్నంలో హేమాద్పంతుకు సన్యాసి రూపంలో దర్శనమిచ్చి, మరురోజు

మధ్యాహ్నం వారింట భిక్షకు రాగలమని చెప్పారు. అతడా విషయం తన భార్యకు చెబితే, మరురోజు ఆమె ఒక అతిథికి గూడ వంట చేసింది. వడ్డనగూడ చేసి ఆయన రాకకై భక్తితో ఎదురుచూస్తున్నారు. సరిగా భోజన సమయానికి అలీ అహమ్మదు, మౌలానాయిస్మూముజావర్ అను ముస్లింలిద్దరు వచ్చారు. వాళ్ళు కాగితంలో చుట్టిన ఒక పటం అతనికిచ్చి, దాని వివరం తర్వాత చెబుతామని వెళ్ళిపోయారు. తీసిచూస్తే అది బాబాపటం! సరిగా సమయానికి సాయియే ఆ రూపంలో వచ్చారు; తమరాకను ముందుగా తెల్పారు. ఆ దంపతులు ఆ పటానికి నైవేద్యమిచ్చి, తర్వాత భోజనం చేసారు.

★★★

